

# అనుభవించరా జీవితం!

అనుకోకుండా ఒక రోజు జనగాం నుండి బాలనర్సయ్య ఫోన్ అందుకున్నాను. అతడు మాకు బాగా జూనియర్. పెళ్లి చేసుకోబోతున్నాట్ట. తప్పక రమ్మని రిక్వెస్ట్ చేసాడు. మాటల్లో కాళిదాసు గుర్తొచ్చాడు. వివరాలడిగితే పొడిపొడిగా సమాధానం చెప్పాడు. హకీంపేటలోనే అతనుంటున్నాడన్న సంగతి మాత్రం నిర్ధారణగా చెప్పాడు. తనకీ ఆహ్వానం పంపానని, వచ్చే విషయం అనుమానమనీ అన్నాడు.

పెళ్లి సోమవారం ఉదయం పదకొండింటికి. ముందురోజు ఓ సండే కలిసి వస్తుండడంతో హకీంపేటకు వెళ్ళి కాళిదాసును కలిసి (సర్‌ప్రైజ్ చేసి) సరదాగా ఆ సాయంత్రందాకా గడిపేసి మరుసట్రోజు ఉదయమే జనగాం వెళ్ళి, పెళ్లి అటెండ్ చేసి సాయంత్రానికి తిరిగి హైదరాబాద్ వచ్చేయాలని అనుకున్నాం. కాళిదాసు గురించి బాలనర్సయ్యకు తెలిసింది కొంచమే. ఇక్కడున్న కొలీగ్స్, మిత్రులూ అయినా శ్రీధర్, అనంత్, చైతన్యలకు అస్సలు తెలీదు. కానీ కాళిదాసు అందాన్ని, ఆర్ట్‌ని నేను కొంచెం ఎక్కువచేసి చెప్పడంతో అందరం కలిసి వెళ్లేందుకు నిర్ణయం జరిగింది. కాళిదాసు గురించి చెప్పిన సంగతుల్లో అమ్మాయిలతో అతనికుండే ఎఫైర్స్ మావాళ్ళని బాగా ఆకర్షించాయి. పనిలో పనిగా పల్లెటూళ్ళో స్వచ్ఛంగా దొరికే రుచులు చూసుకోవచ్చునని కొంత ఆశ పెట్టాన్నేను. అదీ వాళ్ళ సమాయత్తానికి అసలు కారణం.

కాళిదాసును తలుచుకోగానే పన్నెండేళ్ళనాటి మా తొలి పరిచయం గుర్తొచ్చింది. అప్పటికింకా బ్యాంకింగ్ ఎగ్జామ్స్‌తో పడుతూ లేస్తున్న ప్రస్థానం ఓ కొలిక్కి రాలేదు. ఆర్టిస్ట్ బెన్‌హర్ ఆహ్వానం మేరకు యూనియాడ్స్‌లో పని చేసేందుకు వరంగల్ వెళ్లాను.

అక్కడో కుర్రాడి చేతులు బస్సు బాడీమీద కంప్యూటర్ స్పీడుతో కదుల్తూ రంగులద్దుతున్నాయి. నేను చూస్తుండగానే చెక్కు చెదరని ఏకాగ్రతతో ఆ బొమ్మ అద్భుతంగా పూర్తి చేసాడతను.

"ఏంటలా చూస్తున్నావ్ ? వీడు కాళీ ! ఏ పని అప్పగించినా క్షణాల్లో అద్భుతంగా చేస్తాడు" అంటూ కాళిదాసుని పరిచయం చేసాడు బెన్‌హర్.

అప్పుడిటు తిరిగాడు కాళిదాసు. చూడగానే ఆకట్టుకునే ఆరడుగుల విగ్రహం. హెర్క్యులస్‌ని తలపించే కండరాలని సెట్టెడ్ బనియన్ దాచలేకపోతోంది. తీర్చిదిద్దినట్టున్న ముక్కు విశాలమైన నుదురు, చురుకైన కళ్ళు, చుబుకం మధ్యలో నొక్కు, నుదురుతో ఆడుకుంటున్న జుట్టు, నూనూగు మీసాల కట్టు, మగాళ్లని సైతం ముగ్ధుల్ని చేసి ఆపై అసూయకు లోనుచేసే అందం కాళిదాసుది. తొలి పరిచయంలోనే అతనిపట్ల అభిమానం ఏర్పడింది. అతనికీ నాపట్ల గౌరవం ఏర్పడిపోయింది. వయసులో నేను సీనియర్‌నైనా వర్క్‌లో అతనే సీనియర్. ఇద్దరమూ ఒకే గదిలో ఉన్నాం మట్టెవాడలో దాదాపు రెండేళ్ళు. అతి ప్రయాసతో హైదరాబాద్‌లో బ్యాంక్ ఉద్యోగం సంపాదించగలిగాను.

ఉద్యోగం మమ్మల్ని వేరుచేసినా ఉత్తరాలు చాలా కాలం హృదయాల్ని కలిపి ఉంచాయి. కాని పెళ్లి అనే చిన్న పునాదిమీద ఏర్పర్చుకున్న నాలుగ్గోడల ఇరుకుగదికి ఒకే ద్వారం. మా ఇంటికైతే కిటికీలు, వెంటిలేటర్లు కూడా లేవు. ఈ ఇరుకు గదినే స్వర్గధామంగా ఊహించుకుంటూ కాలం ముళ్ల పరుపుమీద దొర్లుతూనే ఉన్నాం. ఇది మా ఉత్తరాల బంధాన్ని కూడా ఎప్పుడో తెంచేసింది. మొన్న మొన్నటిదాక ఎండాకాలంలో చినుకల్లే అడపాదడపా వ్రాసుకుంటూనే వున్నాం లేఖల్ని. హకీంపేట రమ్మని మొదట్లో తరుచూ అభ్యర్ధించే కాళిదాసు ఇప్పుడా ప్రస్తావన కూడా మానేశాడు.

ఇటువంటి పరిస్థితుల్లో బాలనర్సయ్య పెళ్లికి జనగాం వెళ్లవలసి రావడం పరోక్షంగా హకీంపేట వెళ్లి కాళిదాసును కలిసే అవకాశమే నాకు. నా ఫస్ట్ అపాయింట్‌మెంట్ జనగాంలో కావడం, అక్కడ పని చేస్తున్న బాలనర్సయ్యతో స్నేహం ఏర్పడడంతో కాళిదాసు అతనికి పరిచయమయ్యాడు. ఒక్కసారి పరిచయమైతే అతడ్ని మరిచిపోవడం ఎవరికి సాధ్యం ? అటువంటి ఆత్మీయుడ్ని నా మిత్రులకి పరిచయం చేయబోతున్నందుకు ఒకింత గర్వంగా ఉంది.

"జీవితాన్ని అనుభవించడానికి కూడా గట్స్ కావాలి భయ్యా, అవకాశం రానన్ని రోజులూ అతి పవిత్రుల్లా, అవకాశం దొరగ్గానే గుంటనక్కలా వ్యవహరించడం పిరికితనం. నిర్దుష్టమైన ఆలోచనలతో అవకాశాల్ని సృష్టించు కొని అడ్డంకుల్ని దాటుకుని ఆనందాల్ని జుర్రుకోవాలి. జీవితాన్ని నిజంగా అనుభవించాలి" అనే కాళిదాసు బుర్రలో పుచ్చిపోయిన ఆలోచనలు మాత్రం లేవని ఖచ్చితంగా చెప్పగలను. అతని కోసం అమ్మాయిలు తరుచు

వస్తుండేవారు. అందుకే సరదాగా శృంగారరాముడని, పూలరంగడని, మన్మథ్ అని, గ్రీకువీరుడని పిలుస్తూ ఆట పట్టించేవాడ్ని.

❋ ❋ ❋

బయల్దేరే సమయానికి శ్రీధర్ డ్రాపయ్యాడు. మునిమాపు ప్రయాణం బొడ్రాయికాడ తెల్లారిందన్నట్లు ఆదివారం అవరోధాల్ని అధిగమించి మేం బస్సెక్కే టప్పటికి మధ్యాహ్నం దాటిపోయింది. హకీంపేటలో బస్సు దిగేటప్పటికి చీకట్లు బలిసాయి. ఆ ఊరెళ్లడం అదే ప్రథమం. మరీ పల్లేటూరేంకాదు, వేయిగడపలుండొచ్చు.

అటుగా వస్తున్న ఓ యువకుడ్ని అడిగాడు అనంత్ "తమ్మీ ! గీఊళ్ళ కాళిదాస్ ఇల్లెక్కడ ?"

అతను ఎగాదిగా చూసి కిమ్మనకుండా వెళ్ళిపోయాడు. అలాంటి అనుభవాలే మరో రెండు ఎదురయ్యాయి.

"ఏంటి గురూ ! ఈ ఊళ్ళో ఎవరికీ మాటాడ్రావా ? మౌనవ్రతం పాటిస్తున్నారా ?" చైతన్య అయోమయం.

నాకూ బోధపడ్లేదు. కొంచెం ముందుకెళ్లి హోటల్‌లాంటి ఒక పాక చేరుకున్నాం. హోటల్ యజమాని కాబోలు చెక్క తలుపు బిగించి తాళం పెడుతున్నాడు.

"ఓ పెద్దయ్యా ! ఈ ఊళ్ళో కాళి...." నా మాట పూర్తి కాలేదు.

"ఎందుకన్నా మమ్మల్నూకే సతాయిత్తారు. మేము నిమ్మలంగ ఉంటం మీకిట్టంలేదా ? పొద్దుగూకంగానే ఒగల్లొత్తరు, వాడెక్కడ ? వీడెక్కడ ? అని పానం దీత్తరు ! తెల్లారగట్ల ఇంకొగలొత్తరు ఎవల్లచ్చిన్రు ? ఏమడిగిన్రు ? ఎక్కడున్నరు ? అని యేపుక తింటరు. మమ్మల్నుండమంటరా ? సావమంటరా? మీరే చెప్పున్రి ! ఇప్పటికే సగం ఊరు దేశాలు పట్టింది" అంటూ మాపైకి ఒంటికాలిమీద లేచి వెనక్కి తిరిగైనా చూడకుండా వెళ్లిపోయాడు.

అప్పటికిగానీ అసలు సంగతి అవగతం కాలేదు మాకు. అది నక్సల్స్ ప్రాబల్యం ఉన్న ఏరియా, ఈ మధ్యనే జరిగిన ఎన్‌కౌంటర్ మరకలింకా ఆరలేదు. బహుశా కాళిదాసుకూ ఈ విషయంలో గట్టి సంబంధాలుండవచ్చు. అన్నల్లో కలిసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. నాకు తెలిసి అతడు నాస్తికుడు, విప్లవ భావాలు గలవాడు. కాని ఆవేశపరుడు కాదు. అయినా ఆ విగ్రహం, అతని పట్టుదల అతడ్ని అన్నగా మార్చేసే అవకాశాలను తీసి పారేయలేం. యౌవ్వనంలో ఆవేశ పడకపోతే వాని యవ్వనాన్ని, ప్రౌఢ దశలో ఆధ్యాత్మిక చింతన కల్గకపోతే వాని జీవితాన్నే శంకించాల్సి ఉంటుందని ఓ మహానుభావుడు ఊరికే సెలవీయలేదు మరి.

మయసభలో పరాభవాన్ననుభవించిన దుర్యోధనుని పరిస్థితి దాపురించింది మాకు. జనగాంలో రేపు పెండ్లి పెట్టుకుని ఈరోజు బయల్దేరటమేంటి ? కొత్త ప్రదేశానికి ముందు ఇన్‌ఫర్మేషన్ లేకుండా రావడమేమిటి ? వచ్చినా నేనొక్కడ్ని కాకుండా వెంట మరో ఇద్దర్ని తేవడమేంటి ? తెచ్చినా సకాలంలో వెలుతు రుండగా ఊళ్ళోకి వచ్చే ప్లాన్ చేసుకోకుండా.....ఛ.....నామీద నాకే పిచ్చి కోపమొస్తోంది.

ఉదయమెప్పుడో తిని బయల్దేరాం. కడుపులో ఆకలి కలకలం సృష్టిస్తోంది. ఇక్కడ కనీసం మంచినీళ్ళు దొరకడం కూడా కష్టమే అన్పిస్తుంది. ఏమో ఇంకాస్సేపు ఇలాగే తచ్చాడితే అన్నలమే అనుకుని పోలీసులుగానీ, మఫ్టీలో వున్న పోలీసులమనుకుని అన్నలుగానీ పిట్టల్ని కాల్చినట్లు కాల్చి పారేసినా దిక్కులేదు. ఉన్నచోటనే ఉలిక్కిపడ్డాన్నేను.

ఏదో పనికిమాలిన ఆశల్ని కల్పించి మిత్రులిద్దర్నీ మోసం చేశానేమోనన్న గిల్టీకాన్షస్ నన్ను కుదిపేస్తుంటే ....

"ఏం చేద్దాం ?" అన్నాను వాళ్ళ కళ్ళల్లోకి చూడకుండానే తల వంచుకుని.

"ఇంకా చేసేదేముందిబై. పైకాన పత్తా అయిపోతున్నది. ఈ దునియాల ఎవ్వని పానం వానికి ముఖ్యం. మనం బతికుంటేనే మిగతాయన్నీ. జనగాంబోనికె బస్సెప్పుడున్నదో తెల్సుకో. మేమడిగితే మా గడ్డాలు జూసి మరింత డౌట్ పడ్తన్రు. నువ్వే ఎవరికన్న దండం బెట్టి గాసంగతి దెల్సుకో. బాద్‌కీబాత్ బాద్‌మే దేఖ్ లేంగే. ముందు గీ ఊల్లెకెల్లి బయటపడాలె" చైతన్య మాటలు పూర్తి కాలేదు.

ఆరడుగుల ఎత్తున్న ఓ బలిష్టమైన వ్యక్తి నిండా బ్లాంకెట్ కప్పుకుని మా దగ్గంకొచ్చాడు. గడ్డం బాగా పెరిగిపోయి ఉండటంతో ముఖం పోల్చుకునే అవకాశం లేదు. పరిశీలనగా చూసే ధైర్యమూ మిగల్లేదు.

"ఎవరు మీరు ?" గరగరలాడిందతని గొంతు.

ఏం సమాధానం చెబితే ఏమవుతుందో ?

"ఎవ్వలంటే జవాబు చెప్పరేంది ?" మేం తేరుకోకుండానే రెట్టించాడతడు మరింత కరుగ్గా.

సమాధానం చెప్పకపోతే అతని అనుమానం తీవ్రమయ్యేట్టుంది. అందుకే నిజం చెప్పడానికి నిర్ణయించుకున్నాను.

"పెళ్ళికొచ్చామండీ" నేను చెప్పబోతుండాగానే అనంత్ అనేశాడు కంగారుగా.

"ఇక్కడెవల పెళ్లి ?" మమ్మల్ని మార్చి మార్చి చూశాడా ఆగంతకుడు.

"ఇక్కడగాదు.  జనగాంల" సరిదిద్దాడు చైతన్య.  పెనం మీదనుండి పొయిలో బడ్డట్లైంది మా పరిస్థితి.

"జనగాంల పెండ్లిపెట్టుకుని ఈడకెందుకొచ్చిర్రు ?" అంటూనే "అరేయ్ యాదయ్యా, రవీ...."అంటూ కేకేశాడు.

క్షణాల్లో నలుగురు యువకులు చేతుల్లో కర్రలతో ప్రత్యక్షమయ్యారు.

ప్రాణాలు గుప్పిళ్లలోకొచ్చాయి మాకు

"నిజం చెబుతారా ? ఏసెయ్‌మంటారా ?" చివరి హెచ్చరిక చేశాడతను.

"దయచేసి నేను చెప్పేది వినండి" వాళ్లకు వినే ఓపిక ఉండదని తెలుసు.  అందుకే గబగబా చెప్పేశాను "వీళ్ళు చెప్పింది నిజమండీ.  జనగాంలో రేపు ఉదయం మ్యారేజీ. ఇక్కడ కాళిదాసనే మా ఫ్రెండ్ ఉంటాడు.  అతడ్ని కలిసి రేపు వెళ్దామనుకున్నాం.  ఇక్కడ పరిస్థితంతా అయోమయంగా ఉంది.  తిరిగి వెళ్లాలనుకుంటున్నాం"

నా మాటల్లోని నిజాన్ని గ్రహించేందుకు పట్టి పట్టి చూశాడు.  ఆ తరువాత మా అయిడెంటిటీ కార్డ్సు చూసాడు.  నమ్మేశాడు.  'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాం. ఐడెంటిటీ కార్డ్సు మీద, వాటినెప్పుడూ దగ్గరుంచుకోవాలని హితబోధ చేసే మా మేనేజర్ మీద గౌరవం కొండంతయ్యింది.

"ఈ మద్దెన అన్నల ఎంట్రన్సు, పోలీసోళ్ళ న్యూసెన్సు ఎక్కువై పోయింది.  అందుకే ఊళ్ళో పదిమందిమి కలిసి ఒక యూనిట్‌గా మారి కొత్తోల్లనెవ్వల్లను రానిస్తలేం.  మీకు కాళిదాసు సంగతి దెలవదా ?"

అతడలా అడుగుతుంటే ఏమీ తోచలేదు.  మౌనం వహించడమే అత్యుత్తమ మార్గంలా తోచింది.

"సరే !  అతన్ని తీరిగ్గా గలుద్దురుగానీ అన్నం దిని పోదురురాత్రి" అంటూ దారి తీశాడు.

"పర్లేదండీ మాకాకలిగాలేదు."

మొహమాటాన్ని మించిన భయం నాది.  మరో పరిస్థితుల్లో నేనీమాటంటే మీదపడి కొట్టేవాళ్లే మిత్రులు. కానీ ఇప్పుడు కుంజర యూథం దోమ కుత్తుక జొచ్చి నట్లుంది పరిస్థితి.  నోట్లో నాలుకలేని వాళ్లలా నిర్జీవమైన నవ్వుతో సరిపెట్టేసారు.

నా మాటలు పట్టించుకోకుండా అతను మమ్మల్నో భవంతి ఇంటికి తీసుకెళ్లాడు. మమ్మల్నో పెద్ద బల్లమీద వసారాలో కూర్చోబెట్టి లోపల ఆడవాళ్ళతో ఏదో మాట్లాడి

వచ్చాడు.  ఆ తరువాత మా డ్యూటీ పర్టిక్యులర్స్, నివాసం వివరాలు, కాళిదాసుతో పరిచయ విశేషాలు పొడిపొడిగా అడిగాడు. తొలి ఇంటర్వ్యూ నెదుర్కొంటున్న నిరుద్యోగుల్లా జవాబులిచ్చాం మేం.

టమాటా పచ్చడి, పప్పుచారుతో వేడి వేడి అన్నం మొహమాట పెడ్తూనే కడుపుల్ని నింపింది.

భోజనాలు కాగానే యాదగిరిని తోడిచ్చి కాళిదాసు దగ్గరికి పంపించా డతను. అంతసేపూ భయపెట్టి అంతలోనే ఆపద్భాంధవుడైన ఆయన పేరు నరసింహస్వామి. సామన్న అని అందరూ పిలుచుకుంటారు. వచ్చే ముందు చేతులెత్తి హృదయపూర్వకంగా నమస్కరించాం.

యాదగిరి మమ్మల్నో పెంకుటింటి ముందుకు తీసుకెళ్లి "కాళన్నా ! కాళన్నా!" రెండుసార్లు పిలిచాడు.

జవాబులేదు. అసలు మనుషులున్న అలికిడేలేదు. తలుపు సందుల్లోంచి బలహీనమైన కాంతి కనిపిస్తోంది. బయట మసగ్గా ఉంది. వీధి లైటు కూడా కనుచూపు మేరలో లేవు. యాదగిరి డోర్ దగ్గరకు వెళ్లి చూసాడు. తాళం వేసుంది.

కనీసం కాళిదాసును కలిసే అవకాశం కూడా లేదన్న సంగతి ముగ్గురం ఒకరికి తెలియకుండా మరొకరం ఒక్కసారే నిట్టూర్చేశాం.

"ఊళ్ళో లేడేమో ?" నా అనుమానం

"ఆ ! యాడకు వోతడు తియ్ ఇటేపే ఎక్కడ్నో ఉంటడు" అంటూనే ఏదో గుర్తుకొచ్చినట్లు "ఇయ్యాల్ల శనివారంగాదూ, అయితే అనుమాండ్ల కాడుంటాడు. పోదాం రార్రి" అంటూ మా దారి మళ్లించాడు.

రకరకాల అనుమానాలు, భయాలు నన్ను అయోమయానికి లోను చేస్తుండగా యాదగిరి వెంట ఆంజనేయస్వామి దేవాలయం చేరుకున్నాం. గుడి ముందు పెద్ద మండపం. ట్యూబ్‌లైట్ కాంతి వెన్నెలా పరుచుకుని ఉంది. చిన్నా చితకా ముసలీ ముతకా అంతా కలిసి ఓ రెండొందలమందిదాకా ఉన్నారు. కేబుల్ టీవీ యుగంలో కూడా ఆధ్యాత్మిక ప్రసంగాలకు ఇంత ఆదరణ అభించడం ఆశ్చర్యానికి లోను చేసింది.

"ఇక్కడ ఆ శృంగార పురుషుడికేం పని ?" అనుకుంటూనే నా కళ్ళు అతని కోసం వెదకసాగాయి.

"పోల్చుకున్నారా ?" మావైపు తిరిగి అడిగాడు యాదగిరి.

అందులో కాళిదాసును గుర్తించగలవాడ్ని నేనొక్కడ్నే. అతడు ఎవర్ని చూపించి ఆ మాటన్నాడో నాకర్థంకాలేదు.

"అగో, కుర్చీల గూకోని కత జెప్తున్నాడు సూడు, అతనే కాళన్నా" అన్నాడు కన్‌ఫర్మ్ చేస్తునట్లు.

అవాక్కయ్యాన్నేను. నాకు మొదట్లోనే అనుమానమొచ్చింది మేమడిగే కాళిదాసు, వీళ్ళు చెప్పే కాళిదాసు ఒకరు కాదని, ఆ అనుమానం పెంకుటింటి దగ్గరకి తీసుకెళ్లినప్పుడు బలపడిపోయింది. ఇప్పుడది పూర్తిగా నిర్ధారణైపోయింది.

నేనింకా అయోమయం నుండి తేరుకోలేదు.

"ఏమన్నా గావాలంటే సామన్న ఇంటికి రారి. నాకు పనుంది. నేబోతున్నా" తన పనైపోయిందన్నట్లు వెళ్లిపోయాడు యాదగిరి.

అతని వెంబడే వెళ్లి ఈ రాత్రికి తల దాచుకుని తెల్లారి లేచి జనగాంవెళ్తే పోలా ? అన్న ఆలోచనను బలవంతంగా అణచుకుని అతను చూపించిన శాల్తీని పరిశీలనగా చూసాను.

నున్నగా గీసుకున్న షేవింగ్, అంతకంటే నున్నగా మెరుస్తున్న గుండు, నుదుట గంధం బొట్టు, పైన విప్పి కప్పుకున్న ఖండువా, మెళ్లో వేళ్లాడుతున్న సన్నని రుద్రాక్షమాల, సుఖ పద్మాసనంలో కూర్చుని అనర్గళ కధనం కొనసాగిస్తున్నాడు.

మనసునంటిన అసంతృప్తిని తుడుచుకునే ప్రయత్నం చేస్తూ మరింత పరిశీలనగా అతన్ని గమనించాను. అప్పుడు కనిపించింది కుడి బుగ్గమీద కందిగింజంత పుట్టుమచ్చ. 'నువ్వు పుట్టుకతోనే దిష్టిచుక్కతో పుట్టావురా ! నిత్య పెళ్లికొడుకువి' అంటూ కాళిదాసును ఆటపట్టించడం గుర్తొచ్చింది. నిజం.... అతడు ఆ కాళీయే !

ఏదో వివరిస్తూ ఫక్కున నవ్వాడు. కరెక్ట్......నవ్వినప్పుడు బుగ్గమీద సొట్ట, అందమైన పలువరుస.

ఇంతసేపూ చూపేగానీ శ్రవణం అంతగా పని చేయలేదు. ఇప్పుడు గమనించానా గొంతు. కరెక్ట్ అది కాళీ గొంతే. కానీ నమ్మడానికి మనసొప్పడంలేదు.

ఆరడుగుల బలిష్ట విగ్రహవాన్ కాళి, ఈ అర్భకుడూ ఒక్కడేననడం జీర్ణించుకోలేక పోతున్నాను.

"క్యాహై భయ్యా ? ఏ బేచారా ఔర్ పరేషాన్ మే దాల్‌దియానై ?" చైతన్య అనునయిస్తున్నట్లు అన్నాడు. మిత్రులిద్దరి ఉత్సాహం ఈ సాయంత్రమే ఆవిరైపోయింది. 'ఏదో ఈ రాత్రి గడిస్తే చాలు' అనే ఆలోచనకు కమిట్ అయి పోయారు.

"లేదు చైతన్యా ! అతనే కాళిదాసు" ట్రాన్స్‌లో నుండి చెబుతున్నట్లున్న నా మాటలు వాళ్లీద్దర్ని ఉలిక్కిపడేలా చేసాయి.

"జోకా ?" అనంత్ అనుమానం.

"కాదు నిజమే !" నా దృఢత్వం.

ఏమనుకున్నారో వాళ్ళేమీ మాట్లాడలేదు.

కార్యక్రమమైపోయేదాకా ఓపిగ్గా కూర్చున్నాం అక్కడే సర్దుకుని.

కాళిదాసు ఆకారం మారినా స్వరం మారలేదు. గంభీరంగా, అనర్గళంగా, చైతన్య స్రవంతిలా రామాయణంలోని సుందరకాండ వర్ణనను ఛలోక్తులు, లోకోక్తులు కమనీయం చేస్తున్నాయి. వింటున్న ప్రేక్షకుల్లో ఉత్సాహం, తన్మయత.

చూస్తుండగానే కథా శ్రవణమైపోయింది. అర్చకుడు హారతిలిచ్చేసాడు.

శ్రోతల్లో కొందరు హారతైపోయిన తరువాత కూడా కాళిదాసు చుట్టూ చేరి ఏదో సందేహాలడుగుతున్నారు. ఓపికగా చిరునవ్వుతో జవాబులు చెబుతున్నాడు కాళీ.

నన్ను గుర్తిస్తాడో లేదో చూద్దామని జనాల మధ్యనుండి స్థలం చేసుకుని అతని ఎదుట నిల్చుని "నమస్కారం స్వామీ" అన్నాను రెండు చేతులు జోడించి.

యధాలాపంగా ప్రతి నమస్కారం చేస్తూ ఠక్కున ఆగిపోయాడు కాళిదాసు.

"భయ్య......మీరు.....మీరు....."

కాళిదాసును చూస్తుంటే కళ్ళనీళ్లాగలేదు.

నన్ను చూస్తున్న అతని కళ్ళూ చిప్పిల్లాయి

"శీనన్నా..... మీరేంటి ఇక్కడ, ఇలా కనిపించడమేంటి ?" మాటల్ని కూడగట్టుకున్నాడు.

కొద్దిసేపయ్యాక మిత్రులిద్దర్నీ పరిచయం చేసాను.

"ఇంటికెళ్దాం పదండి. అక్కడన్నీ మాట్లాడుకుందాం" అని మమ్మల్ని బయల్దేరదీస్తూ "పాండూ !" అని కేకేశాడు.

ఓ బలిష్టమైన యువకుడు కాళిదాసును చిన్నపిల్లాడి నెత్తుకున్నట్లెత్తుకుని స్కూటర్‌మీద వెనక సీట్లో కూర్చోబెట్టుకుని వెళ్లిపోయాడు. మరో కుర్రాడు మమ్మల్ని కాళిదాసు ఇంటికి చేర్చాడు.

రాత్రి పన్నెండయింది.

అంతసేపూ అలసటతో, మానసికమైన అతలాకుతలంతో నిద్రకోసం ఆరాటపడ్తున్న మేము కాళిదాసు స్థితి చూసి ఆ సంగతే మరిచిపోయాం.

"కాళీ ! ఏంటీ స్థితి ? మాట వరసకైనా నీ ఆరోగ్యం గురించి చెప్పలేదు. కనీసం ఉత్తరాల్లోనైనా నేను చెప్పుకోదగ్గ వ్యక్తిగా అనిపించలేదా ?" అనుకోకుండా నా గొంతులో నిష్ఠూరం తొంగి చూడ్డం నాకే ఆశ్చర్యంగా అనిపించింది.

ఆలోచిస్తునట్లు ఉండిపోయాడు కాళి. తర్వాత నెమ్మదిగా చెప్పాడు.

"నాకు సానుభూతి ఇష్టంలేదన్నా. వరంగల్‌లో నీతో విడిపోయిన తరువాత రెండేళ్ళకు నాకీ వ్యాధి విషయం తెలిసింది. నన్ను కట్టుకున్న దీని పేరు మజులర్ డిస్ట్రోఫీ. ఇంకా వైద్యం అందుబాటులోకి రాని వ్యాధి. శరీరంలోని కండరాలకు రక్త ప్రసరణం ఆగిపోయి రక్తనాళాలు, కండరాలు క్రమేపీ నిర్వీర్యమవుతూ చివరికి అచేతన స్థితి ఏర్పడుతుంది. పిక్కల్లో ప్రారంభమయ్యే ఈ వ్యాధి క్రమేపీ ఆరోహణ క్రమంలో తన అక్రమణను కొనసాగిస్తుంది. మన దేశంలో ఈ వ్యాధి పీడితులు చాల మందే ఉన్నారు. ఒక్క ఆంధ్ర రాష్ట్రంలోనే రెండువందలకు పైగా ఈ కేసులున్నాయట.

"వ్యాధి మొదలైన కొత్తలో ఈ సంగతులన్ని తెలిసి చాలా కుంగిపోయాను. భయాందోళనలతో నిద్రాహారాలకు దూరమయ్యాను. పిచ్చెక్కినంత పనయ్యింది. ఆత్మహత్య చేసుకోవాలనుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఎందరో స్పెషలిస్టులను కలిసాను. చివరికో ఆయుర్వేద వైద్యుడ్ని కలిసాను. ఆయన వైద్యుడే కాదు, యోగి. తన ఆశ్రమానికి తీసుకెళ్లి జీవితాన్ని ఆస్వాదించడమెలాగో చెప్పాడు. ఆహార, విహారాది నియమాలతో పాటు ప్రాణాయామాది మార్గాల్ని నేర్పాడు. అప్పట్నుంచీ....."

"బట్.........ఎంత అందమైన విగ్రహం ? ఎంత గొప్ప అర్ట్. ఇప్పుడు పుల్లల్లా మారిన నీ కాళ్లూ చేతులు...అసలు నువ్వు నువ్వేనని పోల్చుకోలేకపోయా కాళీ ! నిజంగా భగవంతుడు నీకు చాలా అన్యా....."నా మాట పూర్తి కాలేదు.

"శీనన్నా ! ప్లీజ్. దేవుడ్ని నిందించవద్దు. ఇదంతా పిరికిపందలు, పలాయనవాదులు వాడుకునే మాట. తాము సాధించినదానికి జబ్బలు చరుచుకోవడం, చతికిలబడ్డప్పుడు దేవుడ్ని నిందించడం ప్రతి ఒక్కరికి ఫేషనై పోయింది.

"దేవుడు లేడంటూ విర్రవీగిన వాళ్లందరో స్వవిషయంలో ఆందోళన ఏర్పడగానే చేతులు జోడించేసి సర్వమర్పిస్తామని మొక్కుకున్న వాళ్ళే. ఇది తరతరాల చరిత్ర. నా విషయంలోనూ అదే జరిగింది.

"అంతం చేసుకోవాలనుకున్న జీవితానికి ఆధారం చూపించాడు దేవుడు. ఆందోళనల కడలి తరంగాలనుండి ఆనంద నావలోకి ఈ జీవిని చేర్చాడు. రూపమేదైతేనేం

పనిలో, వస్తువుల్లో , జీవుల్లో దేవుడ్ని చూడమన్నది వేదం" చెప్పుకుపోతున్నాడు అలా.

వీడు ఆ కాళిదాసేనా ? అన్న అనుమానం మరోసారి పీకింది. టాపిక్ మార్చాను.

"నీ దినచర్య, మిగతా పనులు..."

"సుజుకీ సామురాయ్. ( నో ప్రాబ్లమ్‌కి మేం అప్పట్లో పెట్టుకున్న పేరు) ఈ వ్యాధివల్ల నేనెదుర్కోబోయే సమస్యల్ని ముందుగానే తెలుసుకుని చాలా ప్లాన్డ్‌గా పరిష్కారాలు వెతుక్కున్నాను. కుర్చీలోనుండి పెద్దగా కదలాల్సిన అవసరంలేని అర్ అండ్ టీ రిపేరింగ్ నేర్చుకున్నాను. ఈ చుట్టుపక్కల మంచి పేరు తెచ్చుకున్నాను. ఆలోచనలన్నీ సక్రమంగా, నిలకడగా కొనసాగించేందుకు ఆశ్రమాన్నాశ్రయించాను. ఆధ్యాత్మికతపట్ల అవగాహన ఏర్పడింది. నాకు తెలిసింది పదిమందికి చెప్పాలన్న ఆలోచనలకు మిత్రులు రూపకల్పన చేసారు. దాని ఫలితమే వారం వారం గుళ్ళో సత్కాలక్షేపం. ఆబాల వృద్ధులూ నన్ను ఎంత ఆదరిస్తున్నారో చూసారుగా !"

దాహమేసినట్టుంది. గ్లాసులోని నీళ్ళు పెద్ద స్ట్రాతో తాగాడు. గొంతు సవరించుకొని కంటిన్యూ చేసాడు.

"నిత్యకృత్యాలు తీర్చుకోవడంలోనూ నాకు సమస్యల్లేవు. ఎవ్వరి సహకారం లేకుండానే నా పనులు నేను చేసుకోగలను. నా గదిలోకి చేరడానికి మెట్లెక్కలేను కాబట్టి అదిగో ఆ ప్లాట్‌ఫామ్" డోర్‌పైనున్న బల్బు వెలిగించాడు దగ్గర్లోవున్న స్విచ్ నొక్కి.

"చదునైన ప్రదేశంలో కర్ర సాయంతో హాయిగా నడవగలను. ఫారిన్ సిస్టమ్ లావెట్రీ ఉండడం సౌకర్యంగా ఉంది. చేతులు తలను మించి మరీ పైకెత్తలేనుగానీ ప్రత్యంగమూ రుద్దుకోగలను. చల్లటి నీటితో షవర్‌బాత్ ఇబ్బంది లేకుండా సాగిపోతుంది. అలాగే భోజనం చేయడానికి ఛాతీ ఎత్తున్న ప్లాట్‌ఫామ్. వంట చేసి పెట్టడానికి, బట్టలుతకడానికి మాత్రం కన్నతల్లిని కష్టపెట్టక తప్పడం లేదు" చివరి మాటలంటున్నప్పుడు కాళిదాసు గొంతు బొంగురు పోయింది. కళ్లనిండా నీళ్ళు - నా చూపును తప్పించుకోలేదు.

"కాళీ నిద్ర బాగా పడుతుందా ?" ఆత్మీయంగా నేను.

"ఓహ్ బ్రహ్మాండంగా. ఈ విషయంలో ఎంతోమంది ఆరోగ్య వంతుల కంటే నేను చాలా బెటర్. పనిచేసి అలసిపోయే నాకు హరిప్రసాద్ చౌరాసియా వేణునాదంతో జోల పాడతాడు. చౌరాసియా ఫ్లూట్ క్యాసెట్స్ డజను దాక ఉన్నాయి" చూపించాడు.

కాళిదాసు శిష్యగణం మాకు పక్కలేర్పాటు చేసారు. రాత్రి బాగా పొద్దుపోయినట్టుంది. టైమ్ చూడాలనిపించలేదు. కాళిదాసు వేణుగానడోల నూగుతూ నిద్రలోకి జారుకున్నాడు.

నాకు నిద్ర పట్టడంలేదు. ఆలోచిస్తుంటే కాళిదాసు మీద గౌరవం ఎంతో పెరిగిపోతుంది. చిన్న చిన్న తగాదాలకు రెచ్చిపోయి కొందరు, బాధలు భరించలేక ఇంకొందరు, ఆవేశవశులై మరికొందరు అనవసరంగా ఆత్మార్పణ చేసుకోవడం నేనెరుగుదును. ప్రాణం మీది తీపితో కష్టాలతో రాజీ పడిపోయి జీవచ్ఛవాల్లా బతుకుతున్న వాళ్ళూ నాకు తెలుసు. కాని జీవితాన్ని సవాల్ చేస్తూ ఆపదలకు ఎదురొడ్డి ఆనందాన్ని అనుభవించడమేమిటో కాళిదాసును చూశాక తెలిసింది.

పక్కమీద అటూ ఇటూ దొర్లుతున్న నాకు ఎక్కడో కోకిల గానం వినిపించింది.

**(అక్టోబర్ 2001, ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక)**